# 17786 కన్నా జారితే

# మరింత బలహీనం




**సమీక్ష** : గత వారం మార్కెట్ ప్రారంభంలో కొంత లాభాలను పొందినా.. తరువాత ఆర్‌బీఐ అంచనాలను మించి కీలక రేట్లను పెంచడంతో విక్రయాల ఒత్తిడికి లోనైంది. మార్కెట్ లాభాలతోనే ఆరంభమైంది. బహుళ బ్రాండ్‌ల రిటైల్‌కు తలుపులు తెరవాలన్న సిఫారసులతో పాటు రిజర్వు బ్యాంకు సమీక్షకు పూర్వం వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే షేర్లలో మదుపరులు పొజిషన్లు తీసుకోవడానికి మొగ్గు చూపడం ఇందుకు దోహదం చేసింది. దీంతో మంగళవారం సెన్సెక్స్ వారపు గరిష్ఠ స్థాయి అయిన 18945కు చేరింది. ఆనక యూరోజోన్ రుణ సంక్షోభంపై ఆందోళనలు, నిరుత్సాహకర త్రైమాసిక ఫలితాలు, మైనింగ్ కంపెనీలపై కర్ణాటక లోకాయుక్త నివేదిక తదితర కారణాలతో నష్టాల పాలైంది. వారాంతానికి సెన్సెక్స్ 18197 వద్ద ముగిసింది. మొత్తం మీద 525 పాయింట్లు కోల్పోయింది.

**ఎఫ్‌ఐఐల పనితీరు** విదేశీ సంస్థాగత మదుపుదారులు (ఎఫ్‌ఐఐలు) రూ.1,248 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా.. మ్యూచువల్ ఫండ్లు రూ.92 కోట్ల నికర కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా** అనుకోని విధంగా కీలక రేట్లు అర శాతం పెరగడంతో స్థిరాస్తి రంగ షేర్లు దెబ్బతిన్నాయి. నిరుత్సాహకర త్రైమాసిక ఫలితాలు యంత్ర పరికరాల స్క్రిప్‌లపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఆరోగ్య సంరక్షణ రంగం ఒక్కటే లాభాలను ఆర్జించింది. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:5గా నమోదవడం అన్ని విభాగాల్లోని కౌంటర్లలోనూ విక్రయాల ఒత్తిడిని సూచించింది.

**భవిష్యత్ అంచనా** సెన్సెక్స్ 200 రోజుల చలన సగటు (డీఎమ్ఏ) వద్ద ఉన్న కీలక నిరోధ స్థాయిని అధిగమించడంలో విఫలం కావడం మార్కెట్లో మరింత పతనం ఉందనడానికి సంకేతం. మధ్య కాలానికి మార్కెట్లో 19002 వద్ద నిరోధ స్థాయి ఉంది. 17134 స్థాయి కన్నా కిందకు జారితే మాత్రం 16000 వరకు దిద్దుబాటు జరగవచ్చు.

**ప్రభావిత అంశాలు** అన్ని అంతర్జాతీయ మార్కెట్లతో పాటు భారత్ కూడా అమెరికా పరిణామాలను గమనించనుంది. అమెరికా ప్రభుత్వం తాను చేసిన రుణాలను తీర్చలేని స్థితి (డిఫాల్ట్)కి వస్తే ప్రపంచ వ్యాప్తంగా విక్రయాలు వెల్లువెత్తవచ్చు. ఐరోపా రుణ సంక్షోభాన్ని కూడా మార్కెట్ గమనిస్తుంది. దేశీయంగా.. పార్లమెంటు సమావేశాలు, వాహన విక్రయాల, సిమెంటు సరఫరా, ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలు ప్రభావం చూపనున్నాయి.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 18064, 17754, 17314; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18359, 18578, 18803

**సెన్సెక్స్ 17786 కన్నా పతనమైతే, మార్కెట్లో బలహీనతలు మరింత పెరుగుతాయి.**

*–సతీశ్ కంతేటి, జెన్‌మనీ*